మెయిన్

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 20
పేజీలు : 3

బుధవారం 06 ఆగస్టు, 2025

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

10వ వసంతంలో "టీ-మీడియా"
మరో ముందడుగు
టీ-మీడియా
న్యూస్ ఛానల్
ప్రారంభం
ఆన్‌లైన్ లింక్ ద్వారా టీ-మీడియా కుటుంబంలో ఉచిత సభ్యత్వం

## 24 గంటల్లో భారత్‌పై...

# భారీగా టారిఫ్‌లు



### ట్రంప్ బెదిరింపులు వైఖరి వెనుక పుతిన్‌పై కోపం




### ఉక్రెయిన్‌పై ఫ్రస్టేషన్

**టి మీడియా, ఆగస్టు 5,ఢిల్లీ బ్యూరో:**
భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన అక్కసు వెళ్లగక్కారు. భారత్‌పై 24 గంటల్లో భారీగా సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. రష్యా నుంచి భారత్ పెద్దమొత్తంలో చమురు కొనుగోలు చేస్తుండడమే ఇందుకు కారణమని ఆయన స్పష్టం చేశారు.ట్రంప్ నిరాశ, నిస్పృహలతో మునిగితేలుతున్నారు. తాను ప్రపంచానికి శాంతి దూత కావాలనుకున్న కల నెలవేరలేదని కలత చెందుతున్నట్లు ఉన్నారు. అదే సమయంలో ఆయనకు సొంత దేశంలోనూ విమర్శలు వస్తున్నాయి. ఎక్కువ ఖరీదైన అమెరికన్ చమురును భారత్? కొనుగోలు చేయాలని ట్రంప్ కోరుకుంటున్నారు. నిజానికి ఉక్రెయిన్?కు అమెరికా ఎప్పటి నుంచో మద్దతు ఇస్తుంది. 2022 ఫిబ్రవరి నుంచి ఇప్పటిదాకా ఉక్రెయిన్‌కు అమెరికా దాదాపు రూ.15 లక్షల కోట్లకుపైగా సైనిక సహాయాన్ని అందించింది.

#### భారత్‌పై ఒత్తిడి

ఉక్రెయిన్?కు అండగా పాశ్చాత్య దేశాలు రష్యాపై పలు ఆంక్షలు విధించాయి. కానీ భారత్? నేరుగా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోంది. ఈ అక్కసుతోనే రష్యా నుంచి చమురు కొనుగోళ్లు నిలిపేయాలని భారత్‌పై చాలా కాలంగా అమెరికా ఒత్తిడి తెస్తోంది. కానీ భారత్ ఈ విషయంలో ఏమాత్రం వెనక్కు తగ్గలేదు. ఇప్పటికే అమెరికా, ఐరోపా దేశాల అభ్యంతరాలను గట్టిగా తిప్పికొట్టింది. అణు పరిశ్రమ, విద్యుత్ వాహనాలు, ఎరువుల తయారీకి అవసరమైన పదార్థాలను రష్యా నుంచి అమెరికా దిగుమతి చేసుకోవడాన్ని ప్రశ్నించింది.రష్యా- ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేస్తానని గొప్పలు చెప్పుకున్నారు. అది వారం కాస్త నెలలుగా మారింది. ఇప్పటి వరకు యుద్ధం ఆగేలా ట్రంప్ చేయలేకపోయారు. కొన్ని రోజుల క్రితం యుద్ధం ఆపడానికి ఆగస్టు 8వ తేదీని డెడ్‌లైన్?ను విధించారు.

#### పుతిన్ పట్టించుకోకపోవడంతోనే!

కానీ దానికి ఇంకా మూడు రోజుల సమయమే ఉన్నా, ఇప్పటికీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ బేఖాతరు చేస్తున్నారు. కనీసం ఒక్కసారి కూడా ఆయన ట్రంప్ డెడ్?లైన్?పై స్వయంగా స్పందించలేదు. చెప్పాలంటే, ట్రంప్? వ్యాఖ్యలను ఆయన పూర్తిగా పట్టించుకోవడం లేదు. దీంతో రష్యాపై ట్రంప్ చాలా కోపంతో ఉన్నారు. తన మాటలను పట్టించుకోవడం లేదని ఆగ్రహంతో ఉన్నట్లు కనిపిస్తున్నారు. అదే సమయంలో ఉక్రెయిన్‌పై ఫ్రస్టేషన్‌తో కూడా ఉన్నారు.

#### రష్యా ఆగ్రహం

రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తే ఇండియాపై సుంకాలను పెంచుతామని ట్రంప్ బెదిరించడంపై క్రెమ్లిన్ తీవ్ర స్థాయిలో మండిపడింది. భారతదేశంపై అమెరికా అక్రమ పద్ధతిలో వాణిజ్య ఒత్తిడిని కలిగిస్తోందని విమర్శించింది. సార్వభౌమ దేశాలకు తమ వాణిజ్య భాగస్వాములను సొంతంగా ఎంచుకునే హక్కు ఉంటుందని స్పష్టం చేసింది.ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపుపై నిర్ణయం తీసుకోకపోవడంతో, మాతో వాణిజ్య సంబంధాలు రద్దు చేసుకోవాలని అమెరికా ఇతర దేశాలను బెదిరిస్తోంది. ఇదంతా మేం గమనిస్తూనే ఉన్నాం. బెదిరింపులకు దిగడం చట్టబద్ధం కాదు. ఎందుకంటే సార్వభౌమ దేశాలు వాణిజ్య, ఆర్థిక సహకారం కోసం సొంతంగా తమ వాణిజ్య భాగస్వాములను ఎంచుకునే హక్కును కలిగి ఉంటాయి. అందుకు విరుద్ధంగా ట్రంప్ బెదిరింపులకు పాల్పడడం సరైన చర్య కాదు" అని దిమిత్రీ పెస్కోవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.రష్యా చేస్తున్న యుద్ధం వల్ల ఉక్రెయిన్ పౌరులు ప్రాణాలు కోల్పోతున్నా భారత్ పట్టించుకోవడం లేదని ట్రంప్ ఆరోపించారు. అందువల్లనే భారత్?పై గణనీయంగా సుంకాలు పెంచుతానని ట్రంప్ ప్రకటించారు. దీనిని రష్యా తీవ్రంగా ఖండించింది. అంతర్జాతీయ వేదికపై తన ఆధిపత్యం క్షీణించడాన్ని అమెరికా ఏమాత్రం జీర్ణించుకోలేకపోతోందని విమర్శించింది. తిరిగి తన స్థానాన్ని నిలబెట్టుకునేందుకు ఆధునిక వలసవాదాన్ని అనుసరిస్తోందని దుయ్యబట్టింది. తమను అనుసరించేందుకు నిరాకరిస్తున్న దేశాలపై అమెరికా రాజకీయ, ఆర్థిక ఒత్తిళ్లు తీసుకొస్తోందని రష్యా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా ఆరోపించారు. గ్లోబల్ సౌత్ (ఆర్థికంగా వెనుకబడిన దేశాలు)లోని రష్యా భాగస్వాముల విషయంలో ట్రంప్ సుంకాల విధానంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ట్రంప్ ఆయా దేశాల సార్వభౌమాధికారంపై, అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.




# సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసు

## పిల్లల్ని అమ్మే ముఠాలతో లింకులు..

**టి మీడియా, ఆగస్టు 5,హైదరాబాద్ :**
రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలన సృష్టించి సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. సృష్టి ఫెర్టిలిటీ డాక్టర్ నమ్రత కస్టడీకి సంబంధించి పోలీసులు సంచలన విషయాలు బయటపెట్టారు. సృష్టి ఫెర్టిలిటీ డాక్టర్ నమ్రత కస్టడీలో సంచలన విషయాలను రాబట్టినట్లు పోలీసులు చెబుతున్నారు. పిల్లల్ని అమ్మే గ్యాంగులతో డాక్టర్ నమ్రత లింకులు పెట్టుకున్నట్లు గుర్తించారు. పిల్లల్ని అమ్మటానికి మహారాష్ట్ర, అహ్మదాబాద్, ఆంధ్రకు చెందిన గ్యాంగ్లతో నమ్రత సంప్రదింపులు జరిపినట్లు చెప్పారు. గతంలో పిల్లల్ని అమ్ముతూ.. అరెస్ట్ అయిన నందిని, హర్ష, పవన్ అనే వ్యక్తులతో ఆమెకు సంబంధాలు ఉన్నాయని అన్నారు. ఒక్కొక్క పిల్లాడిని రూ.3 నుంచి రూ.5 లక్షల రూపాయలకు నమ్రత కొనుగోలు చేసినట్లు పోలీసులు వివరించారు.

బయటపడ్డ సంచలన విషయాలు..
ఐవీఎఫ్ కోసం వచ్చే దంపతులను సరోగసి వైపు మళ్లించి డాక్టర్ నమ్రత అక్రమాలకు పాల్పడినట్లు పోలీసులు చెప్పుకొచ్చారు.

హైదరాబాదులోని
మరో నాలుగు సెంటర్లు కూడా
పిల్లల్ని అమ్మినట్టు గుర్తించినట్లు తెలిపారు.
పెట్టికేర్, హెడ్జ్, ఒయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్లు పిల్లల అమ్మకాలు జరిపినట్లు పేర్కొన్నారు. పిల్లల అమ్మకాలతో పాటు యువతి యువకులను కూడా నమ్రత గ్యాంగ్ ట్రాప్ చేసిందని చెప్పారు. యువతి , యువకుల వీర్యకణాలు అండాలను సేకరించి అమ్మేవారని పోలీసులు స్పష్టం చేశారు.

వెనకున్నది ఎవరు..?
డాక్టర్ సదానందం.. సృష్టి కేసులో కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు పేర్కొన్నారు. సదానందం ప్రమేయంతోనే.. ఇవన్నీ జరిగాయన్నారు. ప్రతి ఆపరేషన్ వెనకాల సదానందం పాత్ర ఉన్నట్లు గుర్తించినట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం సదానందం గాంధీ ఆసుపత్రిలో అనస్థీషియా డాక్టర్‌గా కొనసాగుతున్నారు.

#### తాజా పరిణామం..

తాజాగా.. సృష్టి ఫెర్టిలిటీ కేసులో మహిళా డాక్టర్ అరెస్టయ్యారు. ఈ కేసులో డాక్టర్ విధులత పాత్ర ఇదివరకే వెలుగులోకి రావడంతో.. పోలీసులు ఆమెపై లుకౌట్ నోటీసు జారీ చేశారు. ఈ క్రమంలో ఆమెను గోపాలపురం పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. డాక్టర్ విధులత సోమవారం సాయంత్రం విశాఖ వెళ్లేందుకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆమెపై లుకౌట్ నోటీసు ఉండడంతో సిబ్బంది గోపాలపురం పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో ఆమెను గోపాలపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# కాళేశ్వరంపై మభ్యపెడుతున్నారు..

## మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**టి మీడియా, ఆగస్టు 5,ఖమ్మం :**
కాళేశ్వరం ప్రాజెక్టుకు అప్పటి కేబినెట్ అనుమతులు ఉన్నాయని బీఆర్ఎస్ నాయకులు చెప్పడం పచ్చిబూతు అని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నాయకులు కాళేశ్వరం విషయంలో ప్రజలను మభ్యపెడతున్నారని విమర్శించారు. మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టులో ఏమేం చేశారన్నది జస్టిస్ ఘోష్ నివేదికలో స్పష్టంగా ఉందన్నారు. నివేదికలో ఉన్న అంశాలను అసెంబ్లీతో పాటూ ప్రజల ముందు పెడతామని ఆయన స్పష్టం చేశారు.సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన ప్రకారం జస్టిస్ ఘోష్ నివేదికను అసెంబ్లీలో పెట్టి చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొంగులేటి తెలిపారు. అసెంబ్లీలో చర్చించమని బీఆర్ఎస్ నేతల డిమాండ్ చేస్తున్నారన్నారు. వారి కంటే ముందే.. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో కాళేశ్వరం) చర్చను ప్రకటించారని పేర్కొన్నారు.అసెంబ్లీలో కాళేశ్వరంపై చర్చ పెడితే.. బీఆర్ఎస్ నాయకులు ఉతికారేస్తామంటున్నారు.. ఏం ఉతికికారేస్తారు బట్టలా అని మంత్రి పొంగులేటి ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే.. మామ, అల్లుడు కూర్చొని పిల్లర్లను సరిచేస్తారా.. అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతల మాటలు విని రాష్ట్ర ప్రజలు అసహ్యించుకుంటున్నారని విమర్శించారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకొని వాస్తవాలను గ్రహిస్తే మంచిదని మంత్రి పొంగులేటి హితవు పలికారు.అయితే.. కాళేశ్వరం కమిషన్ నివేదికపై మాజీ మంత్రి హరీష్‌రావుఇవాళ(మంగళవారం) తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై పూర్తి ఆధారాలతో హరీష్‌రావు బ్రీఫింగ్ చేశారు. హరీష్‌రావు ప్రెజెంటేషన్ చూసేలా బీఆర్ఎస్ నేతలు జిల్లాల్లో ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం కమిషన్ నివేదిక పూర్తిగా ట్రాష్ అని విమర్శించారు. ముఖ్యమంత్రి బాధ్యతను మాత్రమే కేసీఆర్ నిర్వర్తించారని... రాజకీయ జోక్యం ఎలా అవుతోందని ప్రశ్నల వర్షం కురిపించారు. కేసీఆర్‌ను హింసించాలనే ధోరణి తప్ప.. సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజా సమస్యలు పట్టడం లేదని హరీష్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ కన్నుమూత

**టి మీడియా, ఆగస్టు 5,ఢిల్లీ బ్యూరో :**
జమ్ముకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, ఢిల్లీలోని రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. ఈ మేరకు మాలిక్? వ్యక్తిగత కార్యదర్శి కె. ఎస్. రాణా తెలిపారు. సత్యపాల్? మాలిక్? ఆగస్టు 2018 నుంచి అక్టోబర్? 2019 వరకు జమ్ముకశ్మీర్? రాష్ట్ర గవర్నర్?గా పనిచేశారు. ఆయన పదవికాలంలోనే కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్? 370ని రద్దు చేసింది.




#### రాజకీయ ప్రస్థానం

డాక్టర్? రామ్? మనోహర్ లోహియా సోషలిస్ట్ భావజాలంతో ప్రేరణ పొందిన మాలిక్ 1965-66లో రాజకీయాల్లో అడుగుపెట్టారు. 1966-67లో మీరట్ కళాశాల విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా, ఆ తర్వాత 1968-69లో అప్పటి మీరట్ విశ్వవిద్యాలయం(ఇప్పుడు చౌదరి చరణ్ సింగ్ విశ్వవిద్యాలయం) విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. ఆ తర్వాత 1974లో శాసనసభలోకి అడుగుపెట్టారు. భారతీయ క్రాంతిదళ్ పార్టీ తరపున పోటీచేసి బాగ్‌పట్ అసెంబ్లీ స్థానాన్ని గెలుచుకున్నారు. అనంతరం ఉత్తర్?ప్రదేశ్ శాసనసభలో పార్టీ చీఫ్ విప్‌గా నియమితులయ్యారు. 1975లో నూతనంగా ఏర్పడిన లోక్‌దళ్‌కు అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1980లో ఆయన లోక్‌దళ్ నుంచి రాజ్యసభకు నామినేట్ అయ్యారు.1984లో భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరిన మాలిక్? 1986లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఉత్తర్?ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీగా కూడా పనిచేశారు. అయితే బోఫోర్స్ కుంభకోణంతో నిరాశ చెందిన ఆయన 1987లో కాంగ్రెస్?కు రాజ్యసభకు రెండింటికీ రాజీనామా చేశారు. అదే సంవత్సరం ఆయన 'జన్ మోర్చా'ను స్థాపించి 1988లో దాన్ని జనతాదళ్‌లో విలీనం చేశారు. మాజీ ప్రధాని విశ్వనాథ్ ప్రతాప్ సింగ్‌తో కలిసి పనిచేశారు. జన్-జాగ్రణ్ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఆ తర్వాత 1987 నుంచి 1991 వరకు జనతాదళ్ కార్యదర్శిగా, ప్రతినిధిగా వ్యవహరించారు. ఆ తర్వాత 1989లో అలీఘర్ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు

# మంత్రి ఇస్తానంటేనే కాంగ్రెస్‌లోకి వచ్చాను

## ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



**టి మీడియా, ఆగస్టు 5,నల్గొండ :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎక్కడో ఓ చోట కాంగ్రెస్‌లో విభేదాలు బయటపడుతూనే ఉన్నాయి. తాజాగా కాంగ్రెస్ పార్టీలో మరోసారి విభేదాలు రాజుకున్నాయి. కాంగ్రెస్ పార్టీపై మునుగోడు నియోజకవర్గం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజల కోసం మరోసారి పదవీ త్యాగానికైనా రెడీ అని బాంబు పేల్చారు.ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఇవాళ(మంగళవారం) మీడియాతో మాట్లాడారు. మంత్రి పదవి ఇస్తానంటేనే కాంగ్రెస్‌లోకి వచ్చా అని కుండబద్దలు కొట్టారు. జూనియర్లకు మంత్రిపదవి ఇచ్చి తనను దూరం పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భువనగిరి ఎంపీని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ పెద్దలు చెప్పారని తెలిపారు. తనకు మంత్రిపదవి ఇస్తారా.. లేదా అనేది కాంగ్రెస్ పార్టీ ఇష్టమని, అందరిలాగా.. పదవుల కోసం కాళ్లు పట్టుకునే నైజం తనది కాదని స్పష్టం చేశారు. ఇకపై తాను ఎంత దూరమైనా వెళ్తానని తేల్చి చెప్పారు. మనసు చంపుకుని బతకడం తన వల్ల కాదని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి 2022 ఆగస్టు 2న కాంగ్రెస్‌కు, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. అనంతరం 2022 ఆగస్టు 21న మునుగోడులో జరిగిన ఆత్మగౌరవ సభలో కేంద్రమంత్రి అమిత్ షా సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేరారు. రాజగోపాల్ రెడ్డిని జాతీయ కార్యవర్గ సభ్యుడిగా బీజేపీ నియమించింది. కాగా, ఆయన 2023 అక్టోబరు 25న బీజేపీకి రాజీనామా చేశాడు. తరువాత మళ్లీ అదే సంవత్సరం అక్టోబరు 27న ఢిల్లీలో పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ మాణిక్‌రావు ఠాక్రే సమక్షంలో తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

# సినీ రంగంలో శ్రమ దోపిడీ

• అనిల్ వల్లభనేని..

**టి మీడియా, ఆగస్టు 5,హైదరాబాద్:**
టాలీవుడ్ సినీ పరిశ్రమలో నెలకొన్న కార్మిక సమస్యలపై ఫిలిం ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ వల్లభనేని కీలక వ్యాఖ్యలు చేశారు. ఫెడరేషన్‌తో సంప్రదింపులు చేస్తామని చెప్పిన ఫిలిం ఛాంబర్, ఇప్పుడు ఒక్కసారిగా ఫెడరేషన్ వద్దు అనే ప్రకటన చేయడం బాధాకరమని వ్యాఖ్యానించారు.

**అవగాహన పెంచాలి**
తెలుగు ఇండస్ట్రీలో అంతర్జాతీయ స్థాయి సినిమాలు వస్తున్నాయంటే అది మన కార్మికుల నైపుణ్యాల ఫలితమని.. వాళ్లలో స్కిల్ లేదని అంటే, క్యాంపులు ఏర్పాటు చేసి ట్రైనింగ్ ఇవ్వాలని అన్నారు. కొత్త కెమెరాలు, టెక్నాలజీ వస్తుంటే వాటి గురించి అవగాహన పెంచాలే కానీ, ఇప్పుడు కార్మికులను పక్కన పెట్టి కొత్తగా మరెవరితోనో పని చేస్తామని చెప్పడం ఎంత వరకు కరెక్ట్ అని ప్రశ్నించారు.



**రోజుకు 15 గంటలు**
వేతనాలు అడిగితే కొత్తవారిని తీసుకువస్తామని నిర్మాతలు చెబుతున్నారని.. సినిమాపై ఇంట్రెస్ట్‌తో ఎవరైనా వస్తే వారిని శ్రమ దోపిడి చేస్తారని సంచలన వ్యాఖ్యలు చేశారు. 'కార్మికులు రోజుకు 15 గంటలు కష్టపడతారు.. వేతన పెంపును తాము ముందు నుంచి అడుగుతూనే ఉన్నాం.. అప్పటికప్పుడు బంద్ అంటూ తాము ఎప్పుడూ ప్రకటించలేదని' అనిల్ వివరించారు.

**కూర్చుని చర్చిస్తే సరిపోతుంది**
కొన్ని నిర్మాణ సంస్థలు తమ అభ్యర్థనను అంగీకరించి, అడిగిన వేతనాలను ఇచ్చి పని చేయిస్తున్నారని, కానీ, బయటకు చెప్పేంతగా తమ వేతనాలు ఎక్కువ కాదని తెలిపారు. వేతన పెంపుపై ఫిలిం ఛాంబర్‌కు, నిర్మాతలకు అభ్యంతరాలు ఉంటే కూర్చుని చర్చిస్తే సరిపోతుందని సూచించారు. లేని పక్షంలో తమ యాక్షన్ ప్లాన్ ఏంటనేది ప్రకటిస్తామని పేర్కొన్నారు. తెలుగు సినీ పరిశ్రమలో ప్రస్తుతం కార్మికుల వేతనాల అంశం చర్చనీయాంశంగా మారింది. కార్మికులు సమాన హక్కులు కోరుతున్నారని, పరిశ్రమలో నైపుణ్యం ఉన్నవారిని పక్కన పెట్టడం సరికాదని ఫెడరేషన్ వాదిస్తోంది. ఈ వివాదం చర్చలతోనే పరిష్కారమవుతుందని ఆశిస్తున్నప్పటికీ, అవసరమైతే ఉద్యమ మార్గాన్ని ఎంచుకుంటామని స్పష్టం చేస్తున్నారు.

## ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు ఆధ్వర్యంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వీక్షణ

**టిమీడియా, ఆగస్టు 5, మేడ్చల్:**
నగరంలోని బిఆర్ఎస్ భవన్ వేదికగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ద్వారా తెలంగాణ ప్రాంతాన్ని సస్య శ్యామలం చేసేందుకు బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ చేసిన కృషిని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలంగాణ ప్రజానీకానికి, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు వివరించగా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గండిమైసమ్మలోని మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమెల్సీ శంభీపూర్ రాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, మర్రి రాజశేఖర్ రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి మాజీ కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీధర్ హాజరై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వీక్షించారు. అనంతరం మాట్లాడుతూ గత పాలకుల హయాంలో అడుగడుగునా నిర్లక్ష్యానికి గురై పాలకుల అసమర్ధ పాలనతో, తెలంగాణపై ఉన్న వివక్షతతో ఎటువంటి అభివృద్ధికి నోచుకోక బీడుబారిన తెలంగాణ ప్రాంతాన్ని మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ద్వారా సస్యశ్యామలం చేసిన అపర భగీరథుడు, తెలంగాణ దార్శనికులు బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ని అన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల కాలంలో తన బృహత్తర ప్రణాళికలతో కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టుతో రైతన్న కళ్ళల్లో ఆనందం నింపి, నాడు దండగగా ఉన్న వ్యవసాయ రంగాన్ని పండుగగా మార్చిన గొప్ప నేత కెసిఆర్ కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టుతో తెలంగాణను సస్యశ్యామలం చేసి దేశంలోనే అత్యధిక దిగుబడి నిచ్చే రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దిన కెసిఆర్ గారిపై అవినీతి మరక అంటించేందుకు ఈ స్కాంగ్రెస్ ప్రభుత్వం కుటిలయత్నాలు చేస్తుందని, దీనిని ప్రజలంతా గమనిస్తున్నారని, అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్ర ప్రగతిని కుంటుపరచిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు.నేడు పెద్దలు హరీష్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తో నాడు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ఆవశ్యకత, ఇంత భారీ ప్రాజెక్టు ద్వారా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రంగానికి కలిగిన లబ్ధిని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం పేరుతో చేస్తున్న అసంబద్ధ ఆరోపణలను నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రజలకు వివరించాలన్నారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి బిఆర్ఎస్ పార్టీయే రక్ష అని అన్నారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల సభ్యులు, నాయకులు, అభిమానులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

**టి మీడియా, ఆగస్టు 5,మహబూబ్‌నగర్ :**
నాగర్‌కర్నూల్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు పార్టీని వీడారు. మంగళవారం మండలంలోని అవురాసిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ కార్యకర్తలు సింగరాజు రాజేష్ ,శ్రీమంతుల శ్రీకాంత్, అంజిరెడ్డి, పలువురు కార్యకర్తలు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు.
ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్ రెడ్డి , జైపాల్ యాదవ్ , బీరం హర్షవర్ధన్ రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఉద్యమ నాయకుడు కేసీఆర్‌సాధించిన తెలంగాణ పార్టీలో చేరడం తమకు సంతోషంగా ఉందని బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు అన్నారు.

# మల్కన్‌గిరి-భద్రాచలం రైల్వే లైన్ మంజూరు

• రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం

**టి మీడియా, ఆగస్టు 5,హైదరాబాద్ బ్యూరో:**
దాదాపు 25 ఏళ్ల క్రితం సర్వే జరిగి పుష్కరకాలం కిందట మంజూరైన పాండురంగాపురం-భద్రాచలం నూతన రైలు ప్రాజెక్టుకు పనులు మొదలుకాకుండానే కాలం చెల్లింది. ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి నుంచి భద్రాచలం మీదుగా పాండురంగాపురం వరకు గతేడాది కొత్త రైల్వే లైన్? మంజూరైన నేపథ్యంలో పాండురంగాపురం-భద్రాచలం ప్రాజెక్టు చేపట్టాల్సిన అవసరమేమి లేదని రాష్ట్ర ప్రభుత్వానికి రైల్వేశాఖ ఇటీవల సమాచారం పంపింది. ఈ పరిణామాల నేపథ్యంలో భద్రాచలం పట్టణానికి ట్రైయిన్?లో వెళ్లాలంటే కనీసం ఐదేళ్లయినా ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.13 కిలో మీటర్లు నిర్మిస్తే సరిపోయేది : భద్రాచలం పట్టణానికి అతి సమీపంలో ఉన్న రైల్వే స్టేషనే ఈ పాండురంగాపురం. ఇది సరిగ్గా కొత్తగూడెం-మణుగూరు రైల్వే స్టేషన్ల మధ్యలో ఉంది. రైలు మార్గం ద్వారా పాండురంగాపురం వరకు వెళ్లినా భద్రాచలం చేరుకోవాలంటే అక్కడి నుంచి మరో 19 కిలో మీటర్ల దూరాన్ని రోడ్డు మార్గంలోనే ప్రయాణించాలి. 2000-01లో సర్వే చేసినప్పుడు పాండురంగాపురం నుంచి భద్రాచలం వరకు 13 కిలో మీటర్ల లైను వేస్తే సరిపోతుందని సంబంధిత ఇంజినీర్లు చెప్పారు.ఈ లైను లాభసాటి కాదన్న కారణంతో ఉచితంగా భూమి ఇవ్వాలని, 50 శాతం వ్యయాన్ని కూడా భరించాలని 2012-13లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్



ప్రభుత్వాన్ని, 2017-18లో తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్ర రైల్వేశాఖ పలుమార్లు కోరింది. నిర్మాణ వ్యయం దాదాపుగా రూ.182 కోట్లు కాగా అందులో సగం అంటే రూ.91 కోట్లు చెల్లించాలని తెలంగాణ సర్కారును కోరింది. ఈ ప్రతిపాదన పెండింగ్‌లో ఉండటంతో ఈ ప్రాజెక్టు కార్య రూపం దాల్చలేదు.

**2030 నాటికి నిర్మాణమయ్యేనా...?**
మల్కన్‌గిరి-భద్రాచలం-పాండురంగాపురం కొత్త రైల్వే ప్రాజెక్టుకు 2024 ఆగస్టు నెలలో కేంద్ర మంత్రి మండలి ఆమోద ముద్ర వేసింది. అంచనా వ్యయం రూ.3,592 కోట్లుగా ప్రకటించింది. 2030 నాటికి నిర్మాణం పూర్తిచేయాలని రైల్వేశాఖ త్వరితగత లక్ష్యంగా పెట్టుకుంది. రైల్వే లైను పాజెక్టు మొత్తం 186 కిలో మీటర్ల దూరం. మధ్యలో 301 కల్వర్టులు, పలు చోట్ల బ్రిడ్జ్?లు నిర్మించాల్సి ఉంటుంది. గోదావరిపై భారీ వంతెన నిర్మించాలి. కానీ ప్రాజెక్టు మంజూరై ఏడాదవుతున్నా పనులు మాత్రం ఇంకా మొదలు కాలేదు.భారీ సంఖ్యలో వంతెనలను నిర్మించాల్సి ఉన్న నేపథ్యంలో 2030 నాటికైనా పూర్తవుతుందా? లేదా? అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. ఒడిశా వైపు నుంచి నిర్మాణం మొదలుపెడితే భద్రాచలం పట్టణానికి రైలుమార్గ నిర్మాణం చాలా ఆలస్యమవుతుంది. పాండురంగాపురం నుంచి మొదలుపెడితే మూడేళ్లలో నిర్మాణం పూర్తయి భక్తులకు రైలుమార్గం తొందరగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

**ఫైనల్ లొకేషన్ సర్వే**
తెలంగాణలో రవాణా ఆధారిత అభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా భావిస్తున్న హైదరాబాద్? ఔటర్ రింగ్ రైలు తుది సర్వే (ఫైనల్ లొకేషన్ సర్వే) ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. రాజధానిలోని సికింద్రాబాద్ నుంచి దేశంలోని వివిధ రాష్ట్రాలకు రాకపోకలు సాగించే ఆరు రైలు మార్గాలతో ఇది కనెక్టివిటీ కానుంది. ఔటర్ రింగ్ రైలు మార్గానికి మూడు రకాల ఎలైన్‌మెంట్లతో దక్షిణ మధ్య రైల్వే ప్రతిపాదనలను సిద్ధం చేసింది. వివిధ కోణాల్లో పరిశీలించి ఇందులో ఒక ఎలైన్‌మెంట్‌ను ఫైనల్?గా ఖరారు చేయనున్నారు.

## ఎంపీ కుమారుడి పేరుతో మోసం

• ఇప్పటికే 14 కేసులు

**టి మీడియా, ఆగస్టు 5,హైదరాబాద్:**
నేను ఎంపీ కుమారుడిని, డాక్టర్?ని అంటూ మోసం చేసిన వ్యక్తిని తెలంగాణ? పోలీసులు అరెస్టు చేశారు. ఇప్పటికే ఈ కేటుగాడుపై ఏపీలో పలు కేసులు ఉన్నాయి. దీంతో ఏపీలో ఉంటే కష్టం అని భావించిన అతడు పక్క రాష్ట్రానికి మకాం మార్చాడు. తెలంగాణకు వెళ్లి అక్కడా మేసం చేయడమే పనిగా పెట్టుకున్నాడు. దీంతో తాజాగా ఓ బాధితురాలు ఫిర్యాదు ఇవ్వడంతో పోలీసులు అరెస్టు చేశారు.తొలుత హైదరాబాద్?లో కేపీహెచ్‌బీలోని ఓ లేడీస్ హాస్టల్ యజమానురాలితో పరిచయం పెంచుకున్నాడు.




ఆమెకు మాయమాటలు చెప్పి బంగారం రీమోడలింగ్ చేయిస్తానంటూ తీసుకున్నాడు. అంతేకాకుండా మరింత బంగారం కావాలంటూ డబ్బులు తీసుకెళ్లాడు. ఇవన్నీ తీసుకున్న తరువాత కనిపించకుండా పోవడంతో సదరు మహిళ పోలీసులను ఆశ్రయించింది.పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి: ఏపీలోని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కుమారుడిని అంటూ మాయ మాటలు చెప్పి మోసాలకు పాల్పడుతున్న కేటుగాడిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిని గుంటూరు జిల్లాకు చెందిన విక్రాంత్‌రెడ్డి అలియాస్ వెంకటేశ్వర్లుగా పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్?లో కేపీహెచ్‌బీలోని ఓ లేడీస్ హాస్టల్‌లో తన బంధువును విక్రాంత్ చేర్పించాడు. ఈ క్రమంలో హాస్టల్ యజమానురాలితో పరిచయం పెంచుకున్నాడు.అంతే కాకుండా తాను ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో న్యూరో సర్జన్?గా పని చేస్తున్నానంటూ చెప్పుకొచ్చాడు. వీటిని నమ్మించేందుకు కొన్ని ఫొటోలు సైతం చూపించాడు. తన బంధువు హాస్టల్‌లో ఉండటంతో తరచూ వచ్చి వెళ్తూ నమ్మకాన్ని ఏర్పరచుకున్నాడు. అనంతరం తనకు జూబ్లీహిల్స్‌లో జ్యువెలరీ షాప్ ఉందని చెప్పి, హాస్టల్ యజమానురాలిని నమ్మించి గొలుసు రీమోడలింగ్ చేయిస్తానని చెప్పాడు.అతడి మాటలు నమ్మి గొలుసును విక్రాంత్‌కు హాస్టల్ యజమానురాలు ఇచ్చారు. అనంతరం ఇంకా మరింత బంగారం అవసరమని చెప్పి మరో లక్ష రూపాయలు వసూలు చేశాడు. వాటిని తీసుకుని అతను కనిపించకుండా పోవడంతో మోసపోయినట్లు గ్రహించిన సదరు మహిళ కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు విచారణలో నిందితుడిపై ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో వివిధ పోలీస్ స్టేషన్లలో 14 మోసాలకు సంబంధించిన కేసులు ఉన్నట్లు గుర్తించారు. జేఎన్‌టీయూహెచ్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్?కు తరలించారు.

## గతి తప్పిన దుర్గగుడి రాజమార్గం

• భక్తుల రాకపోకలకు ఇబ్బందే • ఎలివేటెడ్ క్యూలైన్ నిర్మాణం మొదలు

**టి మీడియా, ఆగస్టు 5,విజయవాడ:**
కనక దుర్గ గుడిలో భక్తులు దర్శనాలకు వచ్చి తిరిగి వెళ్లేందుకు ఒక్క ఘాట్ రోడ్డే ఉంది. అయితే దీని వల్ల భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదని 2016లో కొండ దిగువన కనకదుర్గానగర్‌ను కేవలం వారి రాకపోకల కోసమే పూర్తిగా విస్తరించారు. కాని అక్కడ నిర్మాణాలు అన్నింటినీ తొలగించి మరీ విశాలంగా మార్చారు. కొన్ని ప్రైవేటు నిర్మాణాలకు పరిహారం చెల్లించి మార్గం పెద్దదిగా చేశారు. దానికి రాజమార్గం అని నామకరణం కూడా చేశారు. అటూఇటూ 2 రాతి పెర్గోలాలను రూ.5 కోట్లతో



తీర్చిదిద్ది ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా చేశారు.కనక దుర్గానగర్ మొత్తం విశాలంగా, ఖాళీగా ఉండడంతో దసరా, భవానీదీక్షలకు భక్తులు లక్షలాదిగా వచ్చినా రాకపోకలు సాఫీగా సాగించే వారు. అయితే వైఎస్సార్సీపీ పాలనలో కనక దుర్గానగర్‌ను అస్తవ్యస్తంగా మార్చేశారు. రాత్రికిరాత్రి పెర్గోలాలను పొక్లెయిన్లతో తొలగించి మరీ రూ.5 కోట్ల విలువైన రాళ్లను పక్కన పడేశారు. ఇంక ఆ ప్రదేశమే కాక సగం రాజమార్గాన్ని పూర్తిగా మూసేసేలా ఎలివేటెడ్ క్యూలైన్ నిర్మాణం మొదలు పెట్టారు. మరోవైపు అడ్డంగా దుకాణాలు ఏర్పాటు చేశారు. ఈ రెండింటి మధ్యలో మిగిలిన ప్రాంతం నుంచే భక్తులు రాకపోకలు సాగించాల్సి వస్తుంది.కత్తి మీద సాములా రద్దీ నియంత్రణ: ప్రస్తుత పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే సరిగ్గా 1000 మంది భక్తులు వస్తే అర్జునవీధిలో ఎటూ కదల్లేనంతగా కిక్కిరిసిపోతోంది. దసరా ఉత్సవాలు సమీపిస్తున్న వేళ లక్షల మంది రానున్నారు. ఇంక ఇక్కడ రద్దీ నియంత్రణ కత్తి మీద సాములా మారనుంది. ఎలివేటెడ్ క్యూలైన్ ఎందుకూ పనికిరాదనే విషయం దేవాదాయశాఖ సిబ్బంది అందరికీ తెలుసు. గతంలోనూ ఇలా ఎందుకూ పనికిరాని నిర్మాణాలను చాలానే కట్టడం తిరిగి వాటిని కూల్చడం మళ్లీ కట్టడం లాంటివి ఎన్నోసార్లు చేశారు. ఇప్పటికీ దేవస్థానం ఇంజినీరింగ్ విభాగం తీరు ఏమాత్రం మారలేదు. ఏకంగా రూ.13 కోట్లుపైగా ఖర్చుపెట్టి ఈ ఎలివేటెడ్ క్యూలైన్ ఎందుకు కడుతున్నారో అధికారులకే స్పష్టత లేదు.లాబీయింగ్ చేసి మరీ ఆపకుండా: ప్రస్తుతం నేలపై నుంచి వెళుతున్న భక్తులు ఇది కట్టాక దీని మీదుగా నడిచి వెళ్తార తప్ప ఇంతకుమించి దీని వల్ల ఎలాంటి ఉపయోగం లేదు. వైఎస్సార్సీపీ పాలనలో నిధులను పక్కదారి పట్టించేందుకు అప్పటి దేవాదాయ శాఖ మంత్రి సిఫార్సులతో ఆదరాబాదరాగా ఎన్నికల ముందు ఈ ఎలివేటెడ్ క్యూలైన్ మంజూరు చేసి పునాదుల గోతుల వరకూ తవ్వారు. కూటమి అధికారంలోకి వచ్చాక కూడా దీని పనులు ఇంకా ఎందుకు చేస్తున్నారో అధికారులకే తెలియాలి. దీనిపై ఎన్ని విమర్శలు వచ్చినా తెరవెనుక భారీ కుట్రలు పన్ని మరీ దీన్ని ఆపకుండా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.



## ఫోర్జరీ పత్రాలతో హౌసింగ్ లోన్లు

• రూ.2.61 కోట్లు కొట్టేసిన కానిస్టేబుల్

**టి మీడియా, ఆగస్టు 5,వనపర్తి ప్రతినిధి:**
వనపర్తిలో ఘరానా మోసం బయటపడింది. ఇంటి పత్రాలను ఫోర్జరీ చేసి బ్యాంకులు, ఫైనాన్షియల్ కంపెనీల నుంచి రూ.2.61 కోట్లను కొట్టేసిన ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ప్రజలను మోసాల నుంచి కాపాడాల్సిన పోలీస్ కానిస్టేబుల్‌నే ఈ మోసాల వెనుక ఉండటం కలకలం రేపింది. కాగా మోసపోయిన కంపెనీల్లో పోలీసుల ఇంటి నిర్మాణానికి లోన్లు ఇచ్చే "భద్రత" విభాగం కూడా ఉండటం గమనార్హం.సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ ఆర్.గిరిధర్ వివరాలు వెల్లడించారు. బండారు రాకేశ్ అనే కానిస్టేబుల్ ఐదేళ్లుగా లాంగ్ లీవ్‌లో ఉంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో కొత్త మోసానికి తెరతీశాడు. ఫోర్జరీ ఇంటి పత్రాలను సృష్టించి వాటితో గృహ రుణాలు తీసుకోవడం మొదలుపెట్టాడు. ఇందుకోసం పి.హరీశ్ కుమార్, టి.మల్లేశ్, జి.సందీప్ ఎస్.శేఖర్, బి.కిశోర్ కుమార్‌తో కలిసి ఒక ముఠాను ఏర్పాటు చేశాడు. ఈ ఆరుగురు ఓ ముఠాగా ఏర్పడి.. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, ఎల్ఐసీతో పాటు భద్రత విభాగంలోనూ గృహరుణాలు తీసుకున్నారు.ఒక కేసులో ఎస్.శేఖర్ అనే వ్యక్తి ఇంటిని రాకేశ్ కొనుగోలు చేసినట్లుగా నకిలీ పత్రాలు రూపొందించారు. ఆ పత్రాలతో రూ.89.30 లక్షల రుణం తీసుకున్నారు. ఇదే తరహాలో శ్రీనివాసులు అనే వ్యక్తి ఇంటిని ఎస్.శేఖర్ కొనుగోలు చేసినట్లుగా పత్రాలను ఫోర్జరీ చేశారు. అనంతరం హెచ్‌డీఎఫ్‌సీ, భద్రత విభాగం నుంచి రూ.57.59 లక్షల రుణం పొందారు. ఆ తర్వాత అవే డాక్యుమెంట్స్‌తో ప్రతాప్ అనే వ్యక్తికి రూ.40 లక్షలకు ఇంటిని అమ్మేశారు. అలాగే శివశంకర్ అనే వ్యక్తిని స్వాతి కొనుగోలు చేసినట్లుగా దొంగ పత్రాలు సృష్టించి ఎల్ఐసీ నుంచి రూ.38 లక్షలు హౌసింగ్ లోన్ తీసుకున్నారు. ఆ ఇంటిని అరుణ్ భాషా అనే వ్యక్తికి అమ్మి, భద్రత విభాగం నుంచి రూ.37 లక్షల రుణం తీసుకున్నారు. ఇలా మొత్తంగా రూ.2,61,89,000 మోసం చేశారు.తాజాగా ఈ మోసం బయపడటంతో నిందితులను వనపర్తి పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో బ్యాంకు అధికారులు, భద్రత విభాగం అధికారుల పాత్రపై విచారణ జరుపుతామని తెలిపారు. దర్యాప్తులో మరిన్ని మోసాలు వెలుగు చూసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ కేసు ను చేధించిన వనపర్తి సీఐ ఎం. కృష్ణయ్య, ఎస్సైలు హరిప్రసాద్, రామరాజు, విజయ్ కుమార్ తదితరులను ఎస్పీ అభినందించారు.

## అధ్యక్షుడి సమక్షంలోనే తన్నుకున్న కమలం శ్రేణులు

**టి మీడియా, ఆగస్టు 5,పెద్దపల్లిబ్యూరో :**
పెద్దపల్లి జిల్లాలోని బిజెపిలో వర్గపోరు మరోసారి భగ్గుమంది. సాక్షాత్తు ఆ ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడి సమక్షంలోనే కమలం శ్రేణులు తన్నుకోవడం చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు పెద్దపల్లిలో జరుగు ముఖ్య కార్యకర్త సమావేశానికి వస్తున్న సందర్భంగా మంగళవారం బిజెపి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై పెద్దపల్లి



కమాన్ వద్ద గజమాలతో స్వాగతం పలికారు. ఈ నేపథ్యంలో గుజ్జుల రామకృష్ణారెడ్డి వర్సెస్ దుగ్యాల ప్రదీప్ కుమార్ రెండు వర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ప్రచార వాహనం దిగిపోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ పరస్పరం దాడులు చేసుకున్నారు.పెద్దపల్లి జిల్లా బిజెపి పార్టీలో కొద్దిరోజులుగా వర్గ పోరు సాగుతున్న నేపథ్యంలో రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు ఎదుటే మారో రెండు వర్గాల మధ్య వర్గ పోరు జరిగి నాయకులు, కార్యకర్తలు తన్నుకున్నారు.అక్కడే ఉన్న సీఐ ప్రవీణ్ కుమార్ కార్యకర్తలను వారించి రెండు వర్గాలను శాంతింపజేశారు. బిజెపి తన్నులాట పెద్దపల్లి జిల్లా కేంద్రంలో సంచలనం సృష్టించింది.రాష్ట్ర అధ్యక్షుడి సమక్షంలోనే గ్రూప్ తగాదాలు తలెత్తడంతో కొంత అవమానానికి గురైనట్లు కనబడింది. స్వాగతం తెలిపే క్రమంలో ఇరు వర్గాల మధ్య పెద్ద ఎత్తున మనస్పర్ధలు వచ్చి తన్నుకునే స్థాయికి చేరడం బిజెపి శ్రేణుల్లో కొంత నిరాశను నింపింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ధర్నా బూటకం, నాటకం

• బీజేపీ అధ్యక్షుడు రాం చందర్‌రావు

**టి మీడియా, ఆగస్టు 5,ధర్మారం :**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పై ఢిల్లీలో ఈనెల 6న జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ చేపట్టదలచిన ధర్నా అంతా బూటకం.. నాటకమని( %ణతీఖుఝ% ) బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాం చందర్ రావు విమర్శించారు. పెద్దపెల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ పార్టీకి , రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆయన ఆరోపించారు. పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టాలని సాకు చూపి దానిని బీజేపీ ప్రభుత్వంపై నెట్టాలని కాంగ్రెస్ చూస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ని బీసీలు నమ్మే ప్రసక్తేలేదన్నారు. 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని ఎన్నికల వాగ్దానం చేసిన కాంగ్రెస్ అందులో నుంచి 10 శాతం ముస్లింలకు కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీ చేయనున్న ధర్నా కూడా జంతర్ మంతర్ లాంటిదేనని ఎద్దేవా చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో బీసీలకు ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని ఆ పార్టీ అగ్ర నేత దివంగత రాజీవ్ గాంధీతో పాటు ఆ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ ఎందుకు ఆలోచించలేకపోయారని పేర్కొన్నారు. దీనిని బట్టి ఆ పార్టీకి బీసీలపై ఉన్న చిత్తశుద్ధి తెలుస్తుందని ఆరోపించారు. కేంద్ర క్యాబినెట్‌లో 27 మంది బీసీ మంత్రులు పదవుల్లో ఉండడం ఒక ఉదాహరణ అని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సతీష్ రెడ్డి, టీచర్ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య, మాజీ ఎంపీ వెంకటేష్ నేత, రాష్ట్ర పార్టీ నాయకుడు గోమాస శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామకృష్ణారెడ్డి, కాసిపేట లింగయ్య, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల పార్టీ అధ్యక్షులు కర్ర సంజీవరెడ్డి, యాదగిరి బాబు, ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి కన్నం అంజయ్య, నాయకులు మోరపల్లి సత్యనారాయణ, తాడ్వాయి రాంగోపాల్ రెడ్డి ,గుజ్జుల వేణుగోపాల్ రెడ్డి , మేడవేని శ్రీనివాస్, సంధినేని లక్ష్మణ్, కర్రే లక్ష్మణ్, యాళ్ల తిరుపతిరెడ్డి, గుండా సత్యనారాయణ రెడ్డి, గుండా వెంకట్ రెడ్డి, బైరి శేఖర్, దేవి రాజలింగయ్య, దేవి కొమరేష్ పాల్గొన్నారు.





## దాడులను సహించేది లేదు

• పట్టణ ఆర్యవైశ్య సంఘం

**టి మీడియా, ఆగస్టు 5,వరంగల్ బ్యూరో :**
పట్టణ ఆర్యవైశ్య సంఘంపై దాడులకు, సిబ్బందిపై బెదిరింపులకు పాల్పడిన వారిపై త్వరలో చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటుగా అసభ్య పథజాలంతో దూషించి, నిరాధార ఆరోపణలు చేసిన వ్యక్తులపై పరువు నష్టం దావా వేస్తామని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గుండా ప్రకాష్ రావు అన్నారు. మంగళవారం ఆయన సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.తాను విదేశీ పర్యటనలోవున్న సమయంలో స్థానిక ప్రజాప్రతినిధులను తప్పుదోవ పట్టించి పట్టణ అర్యవైశ్య సంఘం అస్తులపై దాడులు, సిబ్బందిపై బెదిరింపులకు పాల్పడి నగదు ఎత్తుకల్గిన వ్యక్తులపై (గోరంటల యాదగిరి) పోలీసులకు ఫిర్యాదు చేశారని, సంఘం చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటుందని అన్నారు. పొట్టకూటి కోసం ఉద్యోగాలు చేసుకుంటున్న మహిళా సిబ్బందిపై అమర్యాదగా ప్రవర్తించి, అసభ్య పదజాలంతో దూషించిన సభ్యులు (గట్టు మహేష్ బాబు) తను మాట్లాడని మాటలపై ఆత్మ పరిశీలన చేసుకోవాలని హితవు పలికారు.స్వలాభం కోసం, పదవుల కోసం ఏ నాడు సంఘాన్ని వాడుకోలేదని, గతంలో ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో కొందరు వ్యక్తులు కోర్టును ఆశ్రయించి ఎన్నికలకు స్టే అర్డర్ తీసుకురావడం, తదుపరి కరోనా కాలం, కోర్టు వ్యవహారం తేలకపోవడం మూలంగానే ఎన్నికలు నిర్వహించలేదని అన్నారు. త్వరలో కోర్టు వ్యవహారాన్ని ముగించి చట్ట ప్రకారంవున్న 16వేల మంది ఓటర్లతో ఎన్నికలు నిర్వహించడానికి తాము సిద్ధంగా వున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మల్యాల నరమల్లయ్య, దాచేపల్లి సీతారాం, సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో ట్రెండింగ్ పర్సన్ వెంకటేష్ నాయుడు

- ఇంతకీ ఎవరివాడు...?



**టి మీడియా, ఆగస్టు 5,హైదరాబాద్:** చెరుకూరు వెంకటేష్ నాయుడు, హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో నివాసం. 36 ఏళ్ల వెంకటేష్ నాయుడు, లిక్కర్ కేసులో ఏ34 అనూహ్యంగా తెరపైకి వచ్చాడు. లిక్కర్ స్కాం డబ్బును తరలించడానికి సహకారం అందించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వెంకటేష్ నాయుడిని.. జూన్ 18న బెంగళూరు ఎయిర్పోర్టులో సిట్ అదుపులోకి తీసుకుంది. ఈ వెంకటేష్ నాయుడు ఇప్పుడు ఏపీ పొలిటికల్ సర్కిల్స్‌లో పెద్ద దుమారం రేపుతున్నాడు. రెండు రోజులుగా ఇతని చుట్టూనే రాజకీయం నడుస్తోంది. అటు వైసీపీకి ఇటు టీడీపీ మధ్య మాటల యుద్ధానికి కేంద్ర బిందువు అయ్యాడు.

**వైసీపీ నేతలతో సంబంధాలు : టీడీపీ**

చెవిరెడ్డి అనుచరుడిగా ప్రచారం జరుగుతోన్న ఈ వెంకటేష్‌నాయుడు, రెండు రోజుల క్రితం నోట్ల కట్టలను లెక్కిస్తున్న వీడియో వైరల్ అయింది. లిక్కర్ డబ్బులను దాచడం, తరలించడంలో వెంకటేష్ నాయుడు కీలకపాత్ర పోషించారనీ, చెవిరెడ్డి సహా వైసీపీలో కీలక నేతలతో ఆయనకు సంబంధాలు ఉన్నాయనీ టీడీపీ విమర్శలు చేస్తోంది. అయితే టీడీపీ విమర్శలకి వైసీపీ రివర్స్ ఎటాక్ స్టార్ట్ చేసింది.

**టీడీపీ సహా పలు పార్టీల నేతలతో ఫోటోలు**

కేవలం వైసీపీ నేతలతోనే కాదు, టీడీపీ సహా పలు పార్టీల కీలక నేతలతో ఈ వెంకటేష్ నాయుడు ఫోటో దిగాడు. కేంద్ర మంత్రులు, టీడీపీ నాయకులు, బీఆర్ఎస్ కీలక నేతలతో పాటు జగన్‌తోనూ ఫోటోలు దిగారాయన. ఈ ఫోటోలను విడుదల చేసి.. టీడీపీకి కౌంటర్ ఇస్తోంది వైసీపీ.

**రియల్ ఎస్టేట్ వ్యాపారం అంటోన్న వైసీపీ**

వెంకటేష్ నాయుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ అందరితోనూ సన్నిహితంగా ఉంటారని వైసీపీ చెప్తోంది. అతని వ్యాపారానికి సంబంధించిన డబ్బును.. లిక్కర్ డబ్బు అంటూ ప్రచారం చేస్తున్నారని వైసీపీ ఆరోపిస్తోంది. అది లిక్కర్ డబ్బు అయితే, ఎన్నికల్లో పంచింది అయితే, 2 వేల రూపాయల నోట్లు ఎందుకు ఉంటాయని వైసీపీ ప్రశ్నిస్తోంది. అయితే.. వెంకటేష్‌నాయుడికి వైసీపీతోనే లింకులు ఉన్నాయని అధికార కూటమి వాదిస్తోంది.

దీంతో అసలు లిక్కర్ వివాదం కాస్తా పక్కకు వెళ్లి.. వెంకటేష్ నాయుడు ఎవరి అనుచరుడు అనే చర్చ నడుస్తోంది. మీవాడు అంటే మీ వాడు అంటూ వైసీపీ టీడీపీ విమర్శలు చేసుకుంటుంటే ఎవరి వాడో త్వరలో కోర్టులో తెలుస్తుందని అంటోంది సిట

# ఉత్తరకాశీని ముంచెత్తిన వరదలు

- నలుగురు మృతి, 50 మంది గల్లంతు

**టి మీడియా, ఆగస్టు 5,ఢిల్లీ బ్యూరో:** ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీని వరదలు ముంచెత్తాయి. ధారళి గ్రామంపై జలప్రవాహం విరుచుకుపడింది. దీనితో ఆ గ్రామంలో చాలా భాగం కొట్టుకుపోయింది. వరదల్లో చిక్కుకుని నలుగురు మృతి చెందగా, 50 మందికి పైగా గల్లంతు అయ్యారని స్థానికులు చెబుతున్నారు. వరదల ధాటికి 20-25 హోటళ్లు, నివాసాలు కొట్టుకుపోయి ఉండొచ్చని వారు అంటున్నారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.

జలదిగ్భందంలో ప్రజలు...

వరదల వల్ల ఇప్పటికే అనేక ఇళ్లు ధ్వంసం అయ్యాయి. చాలా మంది ప్రజలు జలదిగ్భందంలో ఉన్నారు. పరిస్థితి భయానకంగా ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ అధికారులు సూచించారు. 'ఉత్తరకాశీలోని హర్సిల్ ప్రాంతంలోని ఖీర్?గఢ్?లో నీటి మట్టం అంతకంతకూ పెరుగుతోంది. దీనితో పోలీసులు, ఎస్?డీఆర్?ఎఫ్, సైన్యం సహా విపత్తు ప్రతిస్పందన బృందాలు సహాయక చర్యలు ప్రారంభించాయని' పోలీసులు తెలిపారు. మరో వైపు సహాయక చర్యల కోసం ఉత్తరాఖండ్ ప్రభుత్వం భారత సైన్యాన్ని అప్రమత్తం చేసింది.

కొట్టుకుపోయిన గ్రామం..

ఆకస్మిక వరదల ధాటికి ధరాలి గ్రామంలో చాలా భాగం కొట్టుకుపోయింది. గంగోత్రి ధామ్? యాత్రికుల మార్గంలో ఉన్న ఈ గ్రామంలో వరదలు ఉప్పొంగి ప్రవహించడంతో ఇళ్లు,



దుకాణాలు, మౌలిక సదుపాయాలు అన్నీ కొట్టుకుపోయాయి. ఓ స్థానికుడు చెప్పిన వివరాల ప్రకారం, 'సుమారు 10-12 మంది శిథిలాల కింద చిక్కుకున్నారు. బహుశా వీరు చనిపోయి ఉండవచ్చు'. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోల్లో సదరు గ్రామస్థులు భయంతో కేకలు వేస్తూ, ఎత్తైన ప్రాంతాలకు పరుగెత్తుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. మరోవైపు ఉత్తరకాశీలో బార్కోట్ తహసీల్?లోని బనాలా పట్టి ప్రాంతంలో కుడ్? గధేరా వాగు పొంగిపొర్లడంతో దాదాపు 18 మేకలు కొట్టుకుపోయాయి. అంతేకాదు అనేక మంది ప్రజలు వరద నీటిలో చిక్కుకున్నారు.

ఉత్తరాఖండ్ సీఎంకు అమిత్‌షా ఫోన్...

ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్?సింగ్ ధామితో కేంద్ర హోంమంత్రి అమిత్?షా ఫోన్?లో మాట్లాడారు.? వరదల ధాటికి ధరాలి గ్రామంలో జరిగిన భారీ విధ్వంసం గురించి మాట్లాడారు. కేంద్రం నుంచి పూర్తి మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. సహాయక చర్యల కోసం ధరాలికి వెళ్లాలని ఎన్?డీఆర్?ఎఫ్?, ఐటీబీపీ బృందాలను ఆయన ఆదేశించారు.

ధామి దిగ్భ్రాంతి..

ధరాలి ఘటనపై ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యల విషయంలో సీనియర్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు చెప్పారు. ధరాలీ వార్త చాలా బాధాకరమన్నారు. ప్రస్తుతం ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్, జిల్లా యంత్రాంగం సహా సంబంధిత అధికార బృందాలు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలను తరలిస్తున్నట్లు వెల్లడించారు. బాధితులకు అన్ని విధాలా సహాయం అందిస్తామన్నారు. అందరూ సురక్షితంగా ఉండాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

వాతావరణశాఖ ముందే హెచ్చరించింది!..

ఆగస్టు 10 వరకు ఉత్తరాఖండ్?లో, ముఖ్యంగా కొండ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ముందే హెచ్చరికలు జారీ చేసింది. దీనితో స్థానికులు, పర్యాటకులు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న వారు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. కొండ చరియలు విరిగిపడే ప్రాంతాలకు దూరంగా ఉండాలని కోరారు.



# సభ్యులు ఆర్థికంగా వృద్ధి చెందాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**టి మీడియా, ఆగస్టు 5,కోనరావుపేట:** ఇందిరా మహిళా శక్తి కింద ఎరువులు, ఫర్టిలైజర్ దుకాణాల ఏర్పాటు చేసుకునే అవకాశం పొందిన మహిళలు పకడ్బందీగా వ్యాపారం చేసుకొని ఆర్థికంగా వృద్ధి చెందాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకాంక్షించారు. ఇందిరా మహిళా పథకం కింద సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మర్తన్నపేట గ్రామంలో విశ్వ దర్శనీ గ్రామ సమైక్య మహిళా సంఘం ద్వారా ఏర్పాటు చేసిన ఎరువులు, విత్తనాలు దుకాణాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మంగళవారం ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇందిరా మహిళా శక్తి కింద జిల్లాలోని మహిళా సంఘాలకు ఇప్పటికే క్యాంటీన్లు, డెయిరీ యూనిట్, కోడి పిల్లల పెంపకం, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంక్, ఇతర స్వయం ఉపాధి యూనిట్లను అందజేస్తున్నామని తెలిపారు.త్వరలో ఇందిరా మహిళా శక్తి జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు రైస్ మిల్లులు, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. జిల్లాలో మొత్తం 23 దుకాణాలు మహిళా సంఘాల ఆధ్వర్యలో ఏర్పాటు చేయనున్నామని, ఇందులో భాగంగా ఇప్పటికే పలు దుకాణాలు ప్రారంభించామని వివరించారు. ఎరువులు, పురుగు మందుల దుకాణాలు ఏర్పాటు రాష్ట్రంలోనే ప్రథమమని వెల్లడించారు. మహిళా సంఘాల బాధ్యులు ప్రణాళిక ప్రకారం నిర్వహించి రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు.రైతులు తమ పరిధిలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో ఎరువులు విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసి మహిళలకు ఆర్థికంగా మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, మార్కెట్ కమిటీ చైర్మన్లు, స్థానిక నాయకులు, మహిళా సంఘాల సభ్యులు రైతులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు రాలేదని దంపతుల ఆత్మహత్యాయత్నం

**టి మీడియా, ఆగస్టు 5,చిగురుమామిడి:** ఇందిరమ్మ ఇల్లు నిరుపేద కుటుంబాలకు మంజూరు చేస్తామని చెప్పి, ఇందిరమ్మ కమిటీ అనర్హులను ఎంపిక చేస్తున్నారని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు రోడ్డుపై బైఠాయించి ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు.



వివరాల్లోకి వెళితే కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి చెందిన వంతడుపుల శ్రీనివాస్, సృజన దంపతులు చాలా కాలంగా సొంత ఇల్లు లేక కిరాయి ఇంట్లో ఉంటున్నారు. ఇటీవల ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు.గ్రామంలో ఇల్లు లేని వారికి ఇల్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం చెప్పడంతో అధికారులను, కాంగ్రెస్ నాయకులను ఇల్లు మంజూరు చేయాలని వేడుకున్నారు. ఇందిరమ్మ కమిటీకి పలుమార్లు తమ ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ లబ్ధిదారుల ఎంపికలో తమ పేరు లేకపోవడంతో వారు అవాక్కయ్యారు. అనర్హులను ఇందిరమ్మ ఇళ్లలో ఎంపిక చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, కాంగ్రెస్ నాయకుల తీరుతో మనస్థాపం చెంది బాధిత దంపతులు మంగళవారం సుందరగిరి చౌరస్తా వద్ద రోడ్డుపై పెట్రోల్ బాటిల్ తో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు.అర్హులైన తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంలో ఇందిరమ్మ కమిటీ, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పూర్తిగా విఫలమయ్యారని వారు ఆరోపించారు. రెండో విడతలో సైతం తమకు పేరు లేకపోవడాన్ని వారు జీర్ణించుకోలేకపోయారు. కాంగ్రెస్ నాయకులు సైతం ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఆందోళనను స్థానికులు విరమింపజేసేందుకు ప్రయత్నించగా శ్రీనివాస్ ఒంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. కొంత పెట్రోల్ తాగాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని వెంటనే 108 వాహనంలో హుస్నాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

## 24 గంటల విష్ణు సహస్రనామ పారాయణం

**టి మీడియా, ఆగస్టు 5,మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ జిల్లా మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ దేవాలయం వీరభద్రస్వామి ఆలయంలో అఖండ విష్ణు సహస్రనామ పారాయణంభక్తిశ్రద్ధలతో కొనసాగింది. క్షేత్రపాలకులు ప్రతి సంవత్సరం మాదిరిగా శ్రావణమాసం రెండో సోమవారము నుంచి 45 రోజుల పాటు అఖండ దీపారాధన ఏర్పాటు చేశారు. శ్రావణ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఆలయం అనుమదాసు మంటపంలో అఖండ విష్ణు సహస్రనామ పారాయణాన్ని గద్వాల ఉమాపతి బృందం , సుధా సత్యసాయి బృందం ఆధ్వర్యంలో కొనసాగిందని, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త అలహరి మధుసూదన్ కుమార్ తెలిపారు.



# ఇసుక మాఫియా

- ఇందిరమ్మ ఇండ్లకు కల్తీ ధి రవాణా

**టి మీడియా, ఆగస్టు 5,భీమదేవరపల్లి:** ఇసుక మాఫియా రోజురోజుకు పేట్రేగిపోతుంది. ఎవరి భూమి అయినా సరే. నాకేం సిగ్గు అన్న చందంగా మట్టిని ఇసుకగా జల్లడబడుతూ ఇసుకగా మార్చి అడ్డగోలుగా అమ్ముతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు తమకేమీ సంబంధం లేనట్టు మిన్నకుంటున్నారు. తమ భూములు సర్వం కోల్పోతున్నామని బాధిత రైతులు నెత్తి నోరు కొట్టుకుంటున్న ఈ మాఫియా ఆగడాలు హద్దు అదుపూ లేకుండా పోతుంది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరులో ప్రజా ప్రతినిధులు, రాజకీయ అండదండలతో పట్టపగలు ఇందిరమ్మ ఇండ్లకు ఇష్టారీతిగా ఇసుకను



సరఫరా చేస్తున్నారు. వరకు ఈ మాఫియా ఆగడాలు పాఠశాలల వరకు చేరింది. ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ ముల్కనూర్ లోని మోడల్ స్కూల్ ను సందర్శించారు. పాఠశాలలో కావాల్సిన సదుపాయాలను గూర్చి నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఇది జరిగి పది రోజులు కాకముందే అభివృద్ధి కార్యక్రమాల పేరిట పాఠశాల ఎదుట ఇసుక డంప్ అయింది. అయితే అది ఇసుకనా లేక మట్టినా అనేది తెలియకుండా పోయింది. పాఠశాలకు వస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నేరుగా ఆ మట్టిని చేసి ఇదేనా ఇసుక అంటూ వాపోతున్నారు.

ఇటువంటి ఇసుక వంటి మట్టితో కట్టడాలు నిర్మిస్తే అర్ధాంతరంగా కూలిపోతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రజలు బాహాటంగా ప్రశ్నిస్తున్నారు. మట్టిని ఇసుకగా జల్లెడ పడుతున్న ట్రాక్టర్ ఇంజన్లకు నెంబర్లు ఉండవు, డబ్బాలకు అంతకంటే నెంబర్లు ఉండవు, నడుపుతున్న డ్రైవర్లు మైనర్లు లేదా కాగితాలు ఉండవు, లైసెన్సు ఉండవు, అయినా నన్ను ఎవరు ఏం చేస్తారని ధీమాగా రవాణా చేస్తున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు తమదంటే తమది ఈ డిపార్ట్‌మెంట్ బాధ్యత కాదని దాటవేస్తున్నారు. మట్టిని ఇసుకగా మార్చి సొమ్ము చేసుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# భోజనాల విషయంలో జాగ్రత్తలు

**-ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్**

**టి మీడియా, ఆగస్టు 5,ఖమ్మం :** గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడపబడుతున్న ఆశ్రమ పాఠశాల, పోస్ట్ మెట్రిక్, ప్రీ మెట్రిక్, గురుకులాలు, ఈఎంఆర్ఎస్ పాఠశాలల్లో గిరిజన విద్యార్థిని, విద్యార్థులకు సరఫరా చేస్తున్న అల్పాహారం, భోజనాల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకొని, కల్లూరు గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలో జరిగిన పరిణామాలు ఒక హెచ్చరికగా భావించి ఇకముందు ఇటువంటి పరిణామాలు పునరావృతం కాకుండా చూడవలసిన బాధ్యత సంబంధిత ప్రిన్సిపాల్, హెచ్ఎం, వార్డెన్లపై ఉందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఖమ్మం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడపబడుతున్న ఇన్స్టిట్యూషన్లలో పనిచేయుచున్న ప్రిన్సిపాల్, హెచ్ఎం వార్డెన్ లతో, ఐటిడిఏ పీవో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాఐటిడిఏ పీవో మాట్లాడుతూ, ఒకటిన్నర సంవత్సరాలుగా మన ఇన్స్టిట్యూషన్లో చదివే విద్యార్థినీ విద్యార్థుల చదువుపరంగా గాని, ఆహార విషయంలో గాని, ఆరోగ్య విషయంలో గానీ ఎటువంటి పొరపాట్లు జరగలేదని, కానీ ఈ మధ్యకాలంలో సిబ్బంది నిర్లక్ష్యం, వార్డెన్, హెచ్ఎం, ప్రిన్సిపాల్ ల అశ్రద్ధ వలన తప్పులు జరుగుతున్నాయని, ఇక ముందు ఇలా జరగకుండా చూసుకోవలసిన బాధ్యత మీపై ఉందని అన్నారు. కమిషనర్ జాయిన్ అయి వారం రోజులు కూడా కాలేదని ఈ లోపల మన జిల్లాలో ఉన్న ఇన్స్టిట్యూషన్లో ఇటువంటి తప్పులు దొర్లడం చాలా క్షమించరాని విషయమని, ఎవరిని ఉపేక్షించమని ఇకముందు ఇటువంటి పరిమాణాలు ఏ ఇన్స్టిట్యూషన్లో జరిగిన ఆ సిబ్బందిపై క్రిమినల్ కేసులు పెట్టి శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, విద్యార్థులకు అందించే ఫుడ్ విషయంలో ప్రభుత్వం చాలా సీరియస్ గా ఉందని అన్నారు. ప్రతి ఇన్స్టిట్యూషన్లో ఫుడ్ విషయంలో ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని, వండిన ఆహారాన్ని ముందుగా ప్రిన్సిపాల్, హెచ్ఎం, వార్డెన్, ఉపాధ్యాయులు తిన్న తర్వాతనే సర్టిఫై చేసి పిల్లలకు పెట్టాలని, పిల్లలు భోజనాలు చేసిన తర్వాత అస్వస్థకు గురి అయితే సర్టిఫై చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. వంటగది, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, వారానికి ఒకసారి హెచ్ఎం, వార్డెన్, టీచర్లు, విద్యార్థినీ విద్యార్థులు ఐకమత్యంగా ఉండి శ్రమదానం చేసుకోని పరిసరాలలో మొక్కలు నాటించాలని, జి సి సి నుండి సరఫరా అయ్యే బియ్యం పప్పులు అన్ని సక్రమంగా చూసుకోవాలని ఏమైనా నాసిరకంగా ఉంటే వాపస్ చేసి వెంటనే ఏటీడీవోకు తెలియజేయాలని, పిల్లల చదువుకు భంగం కలగకుండా చూడాలని, ప్రిన్సిపాల్, హెచ్ఎం, వార్డెన్ సిబ్బంది అందరూ స్థానికంగా ఉండాలని, ఆర్ సి ఓ లు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు, ఏటీడీవోలు, ఐటీడీఏ నుంచి నియమించబడ్డ స్పెషల్ ఆఫీసర్లు, ఎస్ సి ఆర్ పి లు వారానికి తప్పనిసరిగా మూడు ఇన్స్టిట్యూషన్లు సందర్శించి ఇన్స్టిట్యూషన్ యొక్క బాగోగులు పిల్లలను అడిగి తెలుసుకోవాలని, ఇకముందు ఫుడ్ పాయిజన్, పిల్లలతో మాట్లాడిన వీడియోలకు సంబంధించిన చిత్రాలు నా దృష్టికి వస్తే అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రతి ఇన్స్టిట్యూషన్లో 100% కొత్త మెనూ అమలు చేసి పిల్లలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, పాఠశాలలకు, వసతి గృహాలకు ఏమైనా మరమ్మతులు ఉంటే చేయిస్తామని అన్నారు.ఈ సమావేశంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ విజయలక్ష్మి, ఆర్సిఓ గురుకులం అరుణకుమారి, ఏటీడీవోలు సత్యవతి, భారతీదేవి, ఖమ్మం జిల్లాలోని ప్రిన్సిపాల్, హెచ్ఎం, వార్డెన్ తదితరులు పాల్గొన్నారు.

టి- మీడియా న్యూస్ ఏజెన్సీ & మీడియా కన్సల్టెన్సీ
GST IN - 36FDKPS 1308PZX
అన్ని పార్టీలు వారికి రాజకీయ ఉపన్యాస పాయింట్స్
- ప్రత్యేక (డిజిటల్, ప్రింట్) సంచికలు
- సోషల్ మీడియా సర్వీసెస్
- పత్రికలకు వార్తలు, స్టోరీలు
- అన్నిరకాల యాడ్స్ డిజైనింగ్
T MEDIA
tmedia.net.in, epaper.tmedia.net.in, News Agency & Media Consultancy, Youtube Channel, Facebook, Instagram, Twitter
ప్రెస్‌మీట్ ఏర్పాటు, ప్రెస్‌నోట్లు తయారీ, ప్రత్యేక దిన పత్రిక డిజిటల్ ఎడిషన్‌లు కోసం
దేశంలో ఎక్కడి వారు అయిన సంప్రదించండి :
8919710365 కు కాల్ చేయండి



# అధిక ధరలకు అమ్మితే చర్యలు

**-ఏడీఏ విజయనిర్మల**

**టి మీడియా, ఆగస్టు 5,మెదక్ :** రైతుల అవసరాలకు సరిపడా యూరియా, ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని ఏడీఏ విజయ నిర్మల అన్నారు. మంగళవారం మెదక్ పీఏసీఎస్ కార్యాలయం ఎరువుల కేంద్రాన్ని ఏడీఏ విజయ నిర్మల, ఏవో శ్రీనివాస్‌తో కలిసి తనిఖీ చేశారు. ఎరువుల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె రైతులతో మాట్లాడుతూ.. మీకు ఏమైనా ఇబ్బందులు ఉంటే మా దృష్టికి తీసుకురావాలని తెలిపారు.రైతులు ఎరువులు తీసుకోవాలంటే తప్పనిసరి ఆధార్ కార్డు, ఈ పాస్ యంత్రం నెట్‌వర్క్ ప్రాబ్లం ఉంటే రైతులు సిబ్బందితో సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు ప్రస్తుత వానాకాలం సీజన్ పంటల సాగు కోసం కావాల్సిన ఎరువుల నిల్వలు ఉన్నాయని తెలిపారు. ఎరువుల విక్రయాలను ఈ-పాస్ ద్వారా జరపాలి.ఎరువుల గోడౌన్‌లు, విక్రయ కేంద్రాలలో విధిగా స్టాక్ బోర్డులు ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని ప్రాంతాలలో రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని అన్నారు. అధిక ధరలకు యూరియాను అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ సాయికుమార్, పెంటయ్య సంబంధిత సిబ్బంది ఉన్నారు.



# ప్లాంటేషన్ త్వరితగతిన పూర్తి చేయాలి

**-జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

**టి మీడియా, ఆగస్టు 5, భద్రాద్రి కొత్తగూడెం:** ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఆవరణలో ప్లాంటేషన్ త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టర్ స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఆవరణలో జరుగుతున్న చెట్లు తొలగింపు మరియు పరిసరాల క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూనివర్సిటీ ఆవరణలో నిర్మించబోవు భవనాల, కంప్యూటర్ ల్యాబ్లు, తరగతి గదులు వాటికి అనుగుణంగా ప్రదేశాన్ని చదును చేయాలని సూచించారు. యూనివర్సిటీ ఆవరణలో ఖాళీ ప్రదేశంలో విస్తృతంగా ప్లాంటేషన్ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించే పనస, టెకోమా, తెల్ల గన్నేరు మరియు మందారం మొక్కలను విస్తృతంగా నాటాలని ఆదేశించారు. యూనివర్సిటీ ఆవరణ అంతా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట పాల్వంచ మునిసిపల్ కమిషనర్ సుజాత, మరియు ఇంజనీరింగ్ సిబ్బంది, యూనివర్సిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.